ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 134 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 + https:www.prajarepublic.com + వెల - 1/- | గురువారం19 డిసెంబర్ 2024

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# అమిత్ షా వ్యాఖ్యలపై
## తమిళ నటుడు విజయ్ కౌంటర్..

అంబేడ్కర్ పై కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈక్రమంలోనే తమిళ నటుడు, టీవీకే అధ్యక్షులు విజయ్ దీనిపై స్పందించారు.

**డిసెంబర్ 19, [రిపబ్లిక్ న్యూస్]:** రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. దీనిపై విపక్షాలు ఆందోళనలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలోనే తమిళ నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షులు విజయ్ గట్టి కౌంటర్ ఇచ్చారు.



కొంతమందికి అంబేద్కర్ పేరు అంటే గిట్టదు అంటూ విమర్శలు చేశారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.'కొంతమందికి అంబేద్కర్ పేరు వినడమే నచ్చదు. ఆయన భారత్ పౌరులందరికీ స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన సాటిలేని రాజకీయ మేధావి. ఆయన అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి. సామాజిక న్యాయానికి ప్రతీక. అంబేద్కర్.. అంబేద్కర్.. అంబేద్కర్ అని ఆయన పేరు అంటే మనసు, పెదవులకు సంతోషంగా ఉంటుంది' అని విజయ్ రాసుకొచ్చారు.ఇదిలాఉండగా.. దళపతిగా సినీరంగంలో తనదైన ముద్ర వేసుకున్న నటుడు విజయ్ 'తమిళగ వెట్రి కళగం' పేరుతో ఇటీవల రాజకీయ పార్టీని ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. పార్టీకి సంబంధించిన జెండాను సైతం ఆయన ఆవిష్కరించారు. పార్టీ మొదటి ర్యాలీలో బాబాసాహెబ్ అంబేద్కర్, పెరియార్ ఈవీ రామస్వామి, కె. కామరాజ్ వంటి మహనీయుల ఆశయాలతో పార్టీని ముందుకుతీసుకెళ్తామని విజయ్ తెలిపారు. తమిళనాడులో వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు టీవీకే పార్టీ సిద్ధమవుతోంది.

# భాజపా ఎంపీకి గాయాలు
## ..రాహుల్ గాంధి నెట్టేశారంటూ ఆరోపణలు

పార్లమెంట్ ప్రాంగణంలో అధికార పక్ష ఎంపీలను విపక్ష నేతలు అడ్డుకున్న సమయంలో ఓ ఎంపీకి స్వల్ప గాయాలయ్యాయి.



**దిల్లీ, డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** పార్లమెంట్ ప్రాంగణంలో గురువారం గందరగోళ వాతావరణం నెలకొంది. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్పై అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. అటు అంబేడ్కర్ ను కాంగ్రెస్ అవమానించిందని ఆరోపిస్తూ అధికార పక్షం కూడా నిరసన చేపట్టారు.

ఇందులో భాగంగా పార్లమెంట్ లోనికి వస్తున్న అధికార పక్షం ఎంపీలను విపక్ష నేతలు అడ్డుకున్నారు. ఈక్రమంలో ఒడిశాకు చెందిన ఓ ఎంపీ గాయపడ్డారు.అధికార పక్షం ఎంపీలను ప్రతిపక్షాలు అడ్డుకునే సమయంలో భాజపా ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి ప్రతాప్ చంద్ర సారంగి కిందపడ్డారు. దీంతో ఆయన తలకు స్వల్ప గాయమవడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. "నేను మెట్ల వద్ద నిల్చొని ఉండగా.. రాహుల్ గాంధీ ఓ ఎంపీని నెట్టేశారు. ఆయన వచ్చి నాపై పడటంతో నేను కిందపడ్డాను" అని ఆరోపించారు.ఈ ఘటనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. "జరిగిందంతా మీ కెమెరాల్లో కనబడి ఉండొచ్చు. నేను పార్లమెంట్ లోపలికి వెళ్తుండగా భాజపా ఎంపీలు నన్ను అడ్డుకొనే ప్రయత్నం చేశారు. తోసేశారు. బెదిరించారు. మల్లికార్జున్ ఖర్గేను కూడా నెట్టేశారు. మాకు లోపలికి వెళ్లే హక్కు ఉంది. కానీ, వారు అడ్డుకుంటున్నారు. ఇక్కడ ప్రధాన సమస్య ఏంటంటే.. రాజ్యాంగంపై వారు (భాజపా) దాడి చేస్తున్నారు. అంబేద్కర్ను అవమానించారు" అని రాహుల్ దుయ్యబట్టారు.ఇదిలాఉండగా.. ఈ ఘటన నేపథ్యంలో రాహుల్ గాంధీపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని భాజపా యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఈ పరిణామాల వేళ పార్లమెంట్ ఉభయ సభలు మధ్యాహ్నానికి వాయిదా పడ్డాయి.

# కష్టపడకుండా వచ్చేది ఏదీ నిలబడదు :నారా భువనేశ్వరి

సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి కుప్పం పర్యటన కొనసాగుతోంది.



**కుప్పం,డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందని.. కష్టపడితే విజయం సొంతమవుతుందని ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. రెండోరోజు కుప్పం పర్యటనలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులతో ఆమె ముఖాముఖి నిర్వహించారు. అంతకుముందు కళాశాల ఆవరణలో ఆమె మొక్కలు నాటారు.ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ ఐటీ రంగంలోనూ మహిళలు రాణించడం సంతోషకరమన్నారు. విజన్ తో ముందుకెళితే అద్భుతాలు సృష్టించవచ్చని చెప్పారు. నిత్యం ప్రజల గురించి ఆలోచించే సీఎం చంద్రబాబే తనకు స్ఫూర్తి అన్నారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ బాగుండాలని ఎంతో కష్టపడి చదివిస్తారని.. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఒకప్పుడు మహిళలు ఇంటికే పరిమితమయ్యేవాళ్లని.. ఆ తర్వాత పరిస్థితులు మారాయని చెప్పారు. ఇప్పుడు అన్ని రంగాల్లోనూ మహిళలు ముందున్నారన్నారు.

**లోకేశికి అదే చెప్పేదాన్ని..**

విద్యార్థులను చూస్తుంటే తనకు కాలేజీ రోజులు గుర్తొస్తున్నాయని భువనేశ్వరి అన్నారు. "నేనూ మీలాగే సరదాగా గడిపాను. కాలేజ్ డేస్ లైఫ్ అంతా గుర్తుంటాయి. నేను చదువుకుంటున్న సమయంలో 19 ఏళ్లకే పెళ్లి చేశారు. నాకు ఆ వయసులో ఏమీ తెలీదు. నా భర్త చంద్రబాబు నాపై నమ్మకంతో హెరిటేజ్ బాధ్యతలు అప్పగించారు. ఒక ఛాలెంజ్ తీసుకుని పనిచేశాను. విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థానాలకు వెళ్లాలి. ఆటపాటలతో పాటు కెరీర్ పైనా విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. విజయం ఊరికే రాదు.. కష్టపడకుండా వచ్చేది ఏదీ నిలబడదు. విద్యార్థి దశ నుంచే లక్ష్యంతో ముందుకెళితే అద్భుతాలు సృష్టించవచ్చు. నా కుమారుడు లోకేశ్కు అదే చెప్పేదాన్ని.


**కుప్పం ప్రజల రుణం తీర్చుకోలేం**

చంద్రబాబు ఎప్పుడూ ప్రజల గురించే ఆలోచిస్తారని.. ప్రజలకు సేవ చేయాలని ఆయన తపిస్తారని భువనేశ్వరి అన్నారు. ఇప్పుడు స్వర్ణాంధ్ర-విజన్ 2047 లక్ష్యంతో ముందుకెళుతున్నారని చెప్పారు. "పేదరికం లేని సమాజమే చంద్రబాబు లక్ష్యం. ఆయన్ను సొంత బిడ్డగా భావిస్తూ ప్రేమాభిమానాలు చూపిస్తున్న కుప్పం నియోజకవర్గ ప్రజల రుణం మేం తీర్చుకోలేం. రాబోయే ఐదేళ్లలో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మాటిస్తున్నాను" అని భువనేశ్వరి అన్నారు.అంతకుముందు శాంతిపురం మండలం శివపురం వద్ద సొంత ఇంటి నిర్మాణాన్ని భువనేశ్వరి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శ్రీకాంత్, పెద్ద ఎత్తున తెదేపా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సీఎం చంద్రబాబు అధ్యక్షతన
## కొనసాగుతున్న క్యాబినెట్ భేటీ

సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది.




**అమరావతి, డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం కొనసాగుతోంది. సీఆర్డీఏ 42, 43 సమావేశ నిర్ణయాలపై ఇందులో చర్చిస్తున్నారు. రాజధాని అమరావతిలో రూ.24,276 కోట్ల విలువైన పనులపై నిర్ణయించనున్నారు. పాలనాపరమైన అనుమతులకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. మున్సిపాలిటీల చట్టం 1965లో సవరణలపై ప్రతిపాదన తీసుకువచ్చారు. మంగళగిరి ఎయిమ్స్ కు అదనంగా మరో 10 ఎకరాల భూమి కేటాయింపుపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.పట్టణాభివృద్ధి శాఖ పరిధిలో పలు చట్ట సవరణలకు క్యాబినెట్ ఆమోదం తెలపనుంది. జలజీవన్ మిషన్లో కొత్త టెండర్లను పిలిచే అంశంపై సమీక్షించనున్నారు. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల చట్ట సవరణ డ్రాఫ్ట్ బిల్లుపై నిర్ణయం తీసుకోనున్నారు. పోలవరం వివిధ ప్యాకేజీ పనులకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. వరద ముంపు బాధితులకు స్టాంప్ డ్యూటీ మినహాయింపుతో పాటు రీషెడ్యూల్ నిర్ణయం తీసుకోనున్నారు. రాష్ట్రంలోని 10 జిల్లాల వరద ముంపు బాధితులకు రుణాల రీషెడ్యూల్పై ఈ సమావేశంలో నిర్ణయించనున్నారు.

# సజ్జల భార్గవ్ రెడ్డిపై
## క్వాష్ పిటిషన్లపై హైకోర్టులో విచారణ

వైకాపా నేత సజ్జలభార్గవ్ రెడ్డి క్వాష్ పిటిషన్లపై ఏపీ హైకోర్టులో విచారణ సాగింది. మొత్తం 4 పిటిషన్లపై వాదనలు సాగాయి.



**అమరావతి, డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా నేత సజ్జల భార్గవ్ రెడ్డి క్వాష్ పిటిషన్లపై ఏపీ హైకోర్టులో విచారణ జరిగింది. మొత్తం 4 పిటిషన్లపై వాదనలు సాగాయి. సోషల్ మీడియాలో అనుచిత పోస్టుల నేపథ్యంలో భార్గవడ్డిపై కేసులు నమోదయ్యాయి. దీంతో వాటిని క్వాష్ చేయాలని ఆయన పిటిషన్లు దాఖలు చేశారు.ఈ క్రమంలో విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. బీఎన్ఎస్ సెక్షన్ 35(3)కి అనుగుణంగా నోటీసులు జారీ చేయాలని పోలీసులను ఆదేశించింది. విచారణను ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా వేసింది. వర్రా రవీందర్ రెడ్డితో భార్గవెడ్డి సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టించారనే ఆరోపణలున్నాయి. దీంతో భార్గవ్ రెడ్డిపై పలుచోట్ల కేసులు నమోదయ్యాయి.

# ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులు రెండేళ్లలో పూర్తి :మంత్రి ఉత్తమ్

బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు భూసేకరణకు రూ.37 కోట్లు విడుదల చేశామని మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి తెలిపారు.



**హైదరాబాద్, డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు భూసేకరణకు రూ.37 కోట్లు విడుదల చేశామని మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి తెలిపారు. ఈ వారంలో మరో రూ.22 కోట్లు విడుదల చేసా-మన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడారు.అన్ని ప్రాజెక్టులను పద్ధతి ప్రకారం పూర్తి చేస్తున్నట్లు ఉత్తమ్ చెప్పారు. ఎస్ఎల్బీసీ టన్నెల్ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. రెండేళ్లలో దీన్ని పూర్తి చేస్తామని తెలిపారు. కాస్ట్ బెనిఫిట్ రేషియో చూసుకుని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పారు. స్టేషన్ ఘన్పూర్ కాల్వకు రూ.120 కోట్లు మంజూరు చేశామని.. త్వరలో టెండర్లు పిలుస్తామని ఉత్తమ్

# జమ్మూకశ్మీర్ లో ఎన్ కౌంటర్
## ..ఐదుగురు ఉగ్రవాదులు హతం

జమ్మూకశ్మీర్ లోని కుల్గాం జిల్లాలో ఎన్ కౌంటర్ జరిగింది.



**డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** జమ్మూకశ్మీర్ లో ని కుల్గాం జిల్లాలో గురువారం ఎన్కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలు జరిపిన ఎదురు కాల్పుల్లో ఐదుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..కుల్గాం ప్రాంతంలో ఉగ్రవాద ఉనికికి సంబంధించి సమాచారం అందడంతో భద్రతా బలగాలు, పోలీసులు కలిసి సంయుక్త ఆపరేషన్ ప్రారంభించాయి. బెహిబాగ్ ప్రాంతంలోని కద్దర్లో నిర్బంధ తనిఖీలు నిర్వహిస్తుండగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. దీంతో భద్రతా సిబ్బంది కూడా ప్రతిదాడికి దిగారు. ఈ ఎన్ కౌంటర్లో ఐదుగురు ఉగ్రవాదులు మృతి చెందినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో గాలింపు కొనసాగుతోంది.ఈ మధ్యకాలంలో ఉగ్రవాదులు, భద్రతా బలగాలకు మధ్య వరుస కాల్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇన్నాళ్లూ పూంఛ్, రాజౌరీ తదితర జిల్లాల్లోనే క్రియాశీలకంగా ఉన్న ఉగ్ర ముఠాలు ఇప్పుడు ఇతర జిల్లాల్లోనూ క్రియాశీలకంగా మారాయి. ఈ ముఠాలపై భారత భద్రతా బలగాలు దృష్టిసారించాయి.

## ముంబయి నటి కేసు.. పీఎస్ఆర్ ఆంజనేయులును ఎందుకు అరెస్టు చేయలేదు?: హైకోర్టు

ముంబయి నటి కేసులో ఐపీఎస్ అధికారులు కాంతిరాణా, విశాల్ గున్నీ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు.




**అమరావతి, డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్):** ముంబయి నటి కేసులో ఐపీఎస్ అధికారులు కాంతిరాణా, విశాల్ గున్నీ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇదే కేసులో ఏ2గా ఉన్న సీతారామాంజనేయులును ఎందుకు అరెస్టు చేయలేదు? అందుకు కారణాలు ఏమిటని ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించారు. సీతారామాంజనేయులు ఇంకా ముందస్తు బెయిల్ పిటిషన్ వేయలేదు కదా అని వ్యాఖ్యానించారు.ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కుక్కల విద్యాసాగర్ను అరెస్టు చేశారు. మిగిలిన నిందితులు కాంతిరాణా, విశాల్గున్నీ, న్యాయవాది, ఏసీపీ, సీఐ.. ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్లపై విచారణ ముగిసే వరకు ఈ కేసులో అరెస్టు నుంచి వారికి హైకోర్టు రక్షణ కల్పించింది. అయితే, ఏ2గా ఉన్న సీతారామాంజనేయులు మాత్రం ఇప్పటి వరకు ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేయలేదు. ఈ నేపథ్యంలో అతన్ని ఎందుకు అరెస్టు చేయలేదని విచారణ సందర్భంగా న్యాయమూర్తి ప్రశ్నించారు. ఐపీఎస్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై ప్రస్తుతం హైకోర్టులో విచారణ కొనసాగుతోంది.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmail.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం



# కేంద్ర క్యాబినెట్ నుంచి అమిత్ షాను తొలగించాలి :మంత్రి పొన్నం ప్రభాకర్

కేంద్ర క్యాబినెట్ నుంచి అమిత్ షాను తొలగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.



హైదరాబాద్, డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్): కేంద్ర క్యాబినెట్ నుంచి అమిత్ షాను తొలగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. అంబేద్కర్పై చేసిన వ్యాఖ్యలకు ఆయనపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలన్నారు. రాజ్యాంగ నిర్మాతను భాజపా అవమానిస్తే భారాస ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్నించారు. అంబేద్కర్పై భాజపా వైఖరిని కేంద్ర మంత్రులు కిషన్రెడ్డి బండి సంజయ్ ( చెప్పాలని డిమాండ్ చేశారు. అదానీ వ్యవహారంలో భారాస వైఖరి ఏంటని ప్రశ్నించారు.అంతకుముందు అసెంబ్లీ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించారు. టీపీసీసీ చీఫ్ మహేశ్కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. అమిత్ షా క్షమాపణలు చెప్పాలని నేతలు డిమాండ్ చేశారు.

# అసెంబ్లీలో మాటల యుద్ధం

## .. స్పీకర్ క్షమాపణ ఎందుకు చెబుతారు?: మంత్రి శ్రీధర్ బాబు

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. సభ కార్యకలాపాలపై సభ్యులకు సరిగ్గా సమాచారం ఇవ్వట్లేదని విపక్షాలు అసహనం వ్యక్తం చేశాయి.



హైదరాబాద్, డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా సాగుతున్నాయి. సభ కార్యకలాపాలపై సభ్యులకు సరిగ్గా సమాచారం ఇవ్వట్లేదని విపక్షాలు అసహనం వ్యక్తం చేశాయి. శాసనసభ నడుపుతున్న తీరుపై విపక్షాలు ఆక్షేపించాయి. సమాచారం లేకుండా ఆర్థిక పరిస్థితిపై చర్చ పెట్టారని విమర్శించాయి. శాసనసభ నిబంధనల ప్రకారం సభ నిర్వహించాలని ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్.. స్పీకర్ దృష్టికి తెచ్చారు. శాసనసభ నడిపే తీరు ఇది కాదని భారాస ఎమ్మెల్యే హరీశ్రావు వ్యాఖ్యానించారు. సభ్యులకు సమాచారం లేకుండా ఎలా మాట్లాడతారని భాజపా పక్షనేత మహేశ్వర్రెడ్డి స్పీకర్కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విపక్ష, అధికార సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి.. సభలో గందరగోళం నెలకొంది.విపక్ష సభ్యుల విమర్శలపై మంత్రి శ్రీధరాబాబు స్పందించారు. సభ నిర్వహణలో కొంత సమాచార లోపం జరిగింది... దీనికే స్పీకర్ సారీ చెబుతారా? అని మండిపడ్డారు. స్పీకర్ కార్యాలయం తీసుకునే నిర్ణయాలకు అన్ని పార్టీలు కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. విపక్షాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నపాటి సమాచార లోపానికి క్షమాపణ చెప్పాల్సిన అవసరం లేదన్నారు."హరీశ్రావు, అక్బరుద్దీన్.. ఇద్దరూ సీనియర్ సభ్యులు. సమాచార లోపం జరిగిందని మేమే చెబుతున్నాం. అయినా క్షమాపణ చెప్పాలంటున్నారు. వారు ఏదైనా చెప్పాలనుకుంటే రిక్వెస్ట్ చేయాలి. అంతేకానీ హుకుం జారీ చేయొద్దు. తప్పు చేస్తే తప్పకుండా క్షమాపణ చెబుతాం. ఎంతో ముఖ్యమైన అంశంపై సభలో చర్చ కొనసాగుతుండగా.. చర్చను పక్కదారి పట్టించేందుకే ఇదంతా చేస్తున్నారు. సభ సజావుగా జరగాలని భారాస నేతలు భావించడం లేదు. ప్రభుత్వ పరంగా ఏదైనా పొరపాటు జరిగితే శాసనసభ వ్యవహారాల మంత్రిగా నేను బాధ్యత తీసుకుంటా.. జవాబుదారీగా ఉంటా. అంతేకానీ స్పీకర్ క్షమాపణ చెప్పాలంటే.. ఎలా సాధ్యం అవుతుంది" అని శ్రీధర్ బాబు అన్నారు.

# అమిత్ షా వ్యాఖ్యలపై స్పందించిన కమల్ హాసన్

అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. తాజాగా దీనిపై నటుడు కమల్ హాసన్ స్పందించారు.



డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. తాజాగా నటుడు, మక్కల్ నీది మయమ్ పార్టీ నేత కమల్ హాసన్ దీనిపై ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ సదర్భంగా అంబేద్కర్ ఆలోచనలతోనే భారతదేశం నిర్మితమైందన్నారు.'గాంధీజీ విదేశీయుల అణచివేత నుంచి భారత్ కు విముక్తి కల్పిస్తే.. అంబేద్కర్ దేశంలోని సామాజిక అన్యాయాల నుంచి విముక్తి కల్పించేందుకు కృషి చేశారు. అంబేద్కర్ దృక్పథాన్ని ప్రతి భారతీయుడు నమ్ముతున్నాడు. దానిపై ప్రతిఒక్కరూ పోరాడతారు. అలాంటి గొప్ప వ్యక్తి వారసత్వాన్ని చెరిపేయాలని చూస్తే ఎవరూ సహించరు. మన రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలైన సందర్భంగా పార్లమెంటులో దానిపై అర్థవంతమైన చర్చలు జరపాలి. అదేవిధంగా అంబేద్కర్ ఆలోచనలను కూడా చర్చించుకోవాలి' అని పేర్కొన్నారు.

# హరీశ్ రావు ఏ హోదాతో మాట్లాడుతున్నారు :మంత్రి కోమటిరెడ్డి

శాసనసభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు మధ్య వాడీవేడి సంభాషణ జరిగింది.



హైదరాబాద్, డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్): శాసనసభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భారాస ఎమ్మెల్యే హరీశ్ రావు మధ్య వాడీవేడి సంభాషణ జరిగింది. తొలుత మంత్రి మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో నీటి సమస్యపై చెప్పారు. ఓ వైపు ఫ్లోరైడ్, మరోవైపు మూసీ మురుగునీటితో ప్రజలు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో 70శాతం పూర్తిచేసిన ప్రాజెక్టును భారాస ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆరోపించారు. పదేళ్లలో రూ.7లక్షల కోట్ల అప్పు చేసినా దీన్ని పూర్తిచేయలేదన్నారు. తమ ప్రభుత్వం గంధమల్ల రిజర్వాయర్ పనులు పూర్తిచేస్తుందని తెలిపారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 40లక్షల మంది జీవితాలను కాపాడాలని జలవనరులశాఖ మంత్రి ఉత్తమ్ను కోమటిరెడ్డి కోరారు. సీఎం, మంత్రులు అందరూ తమ జిల్లాకు అండగా నిలబడాలన్నారు.భారాస ఎమ్మెల్యే హరీశ్రవు మాట్లాడుతూ సభలో ఒక మంత్రి లేచి మరో మంత్రిని ప్రశ్నించే పరిస్థితి ఉండకూడదన్నారు. ఇలా ప్రశ్నలు అడిగేందుకు అవకాశమిస్తే ప్రశ్నోత్తరాలకు అర్థమే మారిపోతుందని.. లేని సంస్కృతిని తీసుకురావద్దని స్పీకర్ను కోరారు. "ఉమ్మడి రాష్ట్రాన్ని ఎక్కువకాలం పాలించింది కాంగ్రెస్ పార్టీ. మా ప్రభుత్వ హయాంలో ఎస్సారెస్పీ స్టేజ్-2 పనులు పూర్తిచేసి కాళేశ్వరం జలాలను ఉమ్మడి నల్గొండ జిల్లాలో సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ ప్రజలకు అందించాం. దీనిపై చర్చ పెట్టండి.. ఎవరేం చేశారో చర్చిద్దాం. మంత్రులు లేచి రాజకీయ ప్రసంగాలు చేస్తే మేం కలగజేసుకోవాల్సి ఉంటుంది. గతంలో కోమటిరెడ్డి మంత్రిగా ఉన్నారు. ఆయన హయాంలోనే మూసీ ఈవిధంగా తయారైంది" అని హరీశ్రావు వ్యాఖ్యానించారు.అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ ఘాటుగా స్పందించారు. "హరీశ్రావు భారాసకు డిప్యూటీ లీడరా? ఎమ్మెల్యేనా? ఏ హోదాతో మాట్లాడుతున్నారు? ఆయనకు ప్రశ్నించే హక్కు లేదు. ప్రతిపక్ష నేత ఏడాదిగా సభకు రాకపోవడం.. తెలంగాణ ప్రజలను అవమానపరచడమే. నల్గొండ ప్రజల కడుపులో ఆవేదన ఎలా ఉంటుందో చెప్పాను. డబ్బున్న వాళ్లు హైదరాబాద్ వచ్చారు. లేని వాళ్లు అక్కడ ఇబ్బందులు పడుతున్నారు. భారాస నేతలకు కనికరం లేదు. ఎస్ఎల్బీసీ సొరంగం 70 శాతం పూర్తిచేశాం. నీటిపారుదలశాఖ మంత్రిగా ఉన్న సమయంలో హరీశ్రావు ఒక్కసారీ సొరంగం వద్దకు రాలేదు. ఆయనకు నల్గొండ గురించి, నా గురించి మాట్లాడే హక్కు లేదు" అని అన్నారు.

# పంట రక్షణ ఉచ్చులో పడి చిరుత మృతి


కృష్ణా జిల్లా గన్నవరం మండలం మెట్లపల్లిలో చిరుతపులి మృతి చెందింది.



గన్నవరం, డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్): కృష్ణా జిల్లా గన్నవరం మండలం మెట్లపల్లిలో చిరుతపులి మృతి చెందింది. నెల రోజుల క్రితం దీని కదలికలను స్థానిక రైతు గమనించాడు. తోటి రైతులకు సమాచారమిచ్చినా వారు అపోహ అని పట్టించుకోలేదు. ఎట్టకేలకు పంట రక్షణ కోసం పందులకు పెట్టిన ఉచ్చులో చిక్కుకొని చిరుత మృతి చెందింది. సమాచారం అందుకున్న అటవీ, పోలీసు శాఖల అధికారులు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. చిరుత చిక్కడంతో చుట్టుపక్కల గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

# హైదరాబాద్ పాతబస్తీలో అగ్నిప్రమాదం

హైదరాబాద్, డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్): పాతబస్తీలో అగ్నిప్రమాదంచోటు చేసుకుంది. ఐఎస్ సదన్ పోలీసు స్టేషన్ పరిధి మాదన్నపేట చౌరస్తాలోనిఓ తుక్కు గోదాంలో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి



చేరుకుని 6 ఫైరింజిన్లతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు.

# జగిత్యాల సబ్ జైలులో రిమాండ్ ఖైదీ మృతి

జగిత్యాల సబ్ జైలులో రిమాండ్ ఖైదీ గుండెపోటుతో మృతి చెందాడు.

జగిత్యాల , డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్): జగిత్యాల సబ్ జైలులో రిమాండ్ ఖైదీ గుండెపోటుతో మృతి చెందాడు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం రామన్నపేటకు చెందిన క్యాతం మల్లేశం అనే వ్యక్తి 15 రోజుల క్రితం అత్యాచారం కేసులో రిమాండ్ ఖైదీగా జగిత్యాల సబ్జైలుకు వచ్చాడు. గురువారం తెల్లవారుజామున అతడికి గుండెపోటు రావటంతో సబ్ జైలు నుంచి హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ మల్లేశం మృతి చెందాడు.



# రాంగోపాల్ వర్మకు అక్రమంగా రూ.2.10కోట్లు చెల్లించారు: జీవీ రెడ్డి

వైకాపా ప్రభుత్వం తీరుతో ఏపీ ఫైబర్నెట్ (ఏపీఎస్ఎఫ్ఎల్)

ప్రస్తుతం దివాళా అంచున ఉందని ఆ సంస్థ చైర్మన్ జీవీ రెడ్డి



అమరావతి, డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్): వైకాపా ప్రభుత్వం తీరుతో ఏపీ ఫైబర్నెట్ (ఏపీఎస్ఎఫ్ఎల్) ప్రస్తుతం దివాళా అంచున ఉందని ఆ సంస్థ ఛైర్మన్ జీవీ రెడ్డి అన్నారు. దర్శకుడు రాంగోపాల్ వర్మకు అప్పటి అధికారులు అక్రమంగా రూ.2.10కోట్లు చెల్లించారని చెప్పారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో జీవీ రెడ్డి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ధరలకు ఇంటర్నెట్ సేవలు అందించడమే లక్ష్యంగా 2016లో సీఎం చంద్రబాబు దీన్ని ప్రారంభించారన్నారు. 2019 నాటికి 24 వేల కి.మీ మేర కేబుల్ వేసి 10లక్షల కనెక్షన్లు ఇచ్చామని తెలిపారు. ఇవాళ ఆ సంఖ్య 5లక్షలకు పడిపోయిందన్నారు."ఏపీ ఫైబర్నెట్ సంస్థలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. గత ప్రభుత్వం కేబుల్ ఆపరేటర్లను వేధింపులకు గురిచేసింది. అప్పటి ఎండీ మధుసూదన్ అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. వైకాపా నేతల అక్రమాలు బయటపడకుండా కీలక దస్త్రాలు మార్చేశారు. కీలక డాక్యుమెంట్లను వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డికి ఓ మహిళా ఉద్యోగి చేరవేశారు.ఆమెను ఉద్యోగం నుంచి తొలగించాం. అనవసర ఖర్చులు తగ్గించుకుని నిధులు సమీకరించుకుంటాం. 'వ్యూహం' సినిమాను ఫైబర్నెట్లో టెలికాస్ట్ చేసి అక్రమంగా దర్శకుడు రాంగోపాల్వర్మ (ఆర్జీవీ)కి చెల్లింపులు చేశారు. ఎక్కడా లేనివిధంగా అప్పటి అధికారులు వ్యవహరించారు. ఆ సినిమాకు 18 లక్షల వ్యూస్ వస్తే రూ. 2 లక్షలు చెల్లించాల్సి ఉండగా రూ.2.10 కోట్లు ఇచ్చారు" అని జీవీ రెడ్డి వివరించారు.

# 'కాళేశ్వరం'పై విచారణ

## ..స్మితా సభర్వాల్ ను ప్రశ్నించిన పీసీ ఘోష్ కమిషన్

కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణలో భాగంగా ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ ను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నించింది.



హైదరాబాద్, డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణలో భాగంగా ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్ను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నించింది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్ ల నిర్మాణ అనుమతులపై ప్రశ్నలు అడిగింది. క్యాబినెట్ అనుమతి లేకుండానే జీవోలు వచ్చాయా అని ప్రశ్నించింది. కమిషన్ ప్రశ్నలకు స్మితా సభర్వాల్ తెలియదని సమాధానమిచ్చారు.కమిషన్ ముందు హాజరైన సోమేశ్ కుమార్ మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ ను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రశ్నించింది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజ్ ల అనుమతులకు సంబంధించి ఆయన్ ను ప్రశ్నలు అడిగారు. తాను బాధ్యతలు స్వీకరించక ముందే బ్యారేజ్ల నిర్మాణం పూర్తయిందని సోమేశ్ కుమార్ బదులిచ్చారు. వాటి అనుమతులు, క్యాబినెట్ తీర్మానాల గురించి తనకు తెలియదన్నారు. ఇతర శాఖల గురించి ఆయన ప్రస్తావించగా... కేవలం బ్యారేజ్ల గురించి మాత్రమే చెప్పాలని జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సూచించింది.

# అల్కాపురి టౌన్షిప్లో హైడ్రా చర్యలు ..షట్టర్ల తొలగింపు

అల్కాపురి టౌన్షిప్లో హైడ్రా చర్యలు చేపట్టింది. మార్నింగ్ రాగా అపార్టుమెంట్లో నిబంధనలకు విరుద్ధంగా షట్టర్లు వేసి దుకాణాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.




హైదరాబాద్,డిసెంబర్ 19, (రిపబ్లిక్ న్యూస్): అల్కాపురి టౌన్షిప్లో హైడ్రా చర్యలు చేపట్టింది. మార్నింగ్ రాగా అపార్టుమెంట్లో నిబంధనలకు విరుద్ధంగా షట్టర్లు వేసి దుకాణాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు షట్టర్లను తొలగించారు. హైడ్రా, పోలీసులను మార్నింగ్ రాగా అపార్టుమెంట్ వాసులు గత నెల 27న మణికొండ మున్సిపల్ అధికారులు ఇక్కడి వారికి నోటీసులు ఇచ్చారు. 7 రోజుల్లో షట్టర్లు తొలగించాలని అందులో పేర్కొన్నారు. నోటీసులకు స్పందించకపోవడంతో తాజాగా గురువారం షట్టర్లను తొలగించారు. ఇందుకు హైడ్రా సాయం తీసుకున్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్



# థియేటర్ లో 'ఆర్ఆర్ఆర్' స్పెషల్ డాక్యుమెంటరీ .. టికెట్ ధర ఎంతంటే?

**రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్చరణ్ కథానాయకులుగా నటించిన 'ఆర్ఆర్ఆర్' డాక్యుమెంటరీ థియేటర్‌లో విడుదలకు సిద్ధమైంది.**




ఎన్టీఆర్ , రామ్చరణ్ కథానాయకులుగా ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'ఆర్ఆర్ఆర్'. అలియాభట్, ఓలివియా మోరిస్, అజయ్ దేవణ్, శ్రియ, అలీసన్ డూడీ, దివంగత నటుడు రే స్టీవెన్ సన్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. డీవీవీ ఎంటర్టైన్మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య నిర్మించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.1300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. అంతేకాదు, ఉత్తమ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో 'నాటు నాటు' పాట ఆస్కార్ అవార్డు సొంతం చేసుకొని, చరిత్ర సృష్టించింది. ఓటీటీలోనూ రికార్డు వ్యూస్తో అలరించిన ఈ చిత్రం ఇప్పుడు మరో రూపంలో ప్రేక్షకుల ముందుకురానుంది.

ఇద్దరు స్టార్ హీరోలు నటించడం, 'బాహుబలి' వంటి భారీ చిత్రాన్ని రూపొందించిన రాజమౌళి దర్శకత్వం వహించడం 'కు ఎనలేని క్రేజ్ తీసుకొచ్చాయి. ప్రేక్షకుడు చూసే మూడు గంటల సినిమా వెనక మూడేళ్ల కష్టం దాగి ఉంది. దర్శకుడి విజన్ను తెరపై ఆవిష్కరించడానికి తెర వెనక వందల మంది కష్టపడ్డారు. ఇదంతా ఇప్పుడు డాక్యుమెంటరీ రూపంలో 'ఆర్ఆర్ఆర్' చిత్ర బృందం ప్రేక్షకులకు అందించడానికి సిద్ధమైంది. 'ఆర్ఆర్ఆర్- బిహైండ్ అండ్ బియాండ్' పేరుతో డాక్యుమెంటరీని సిద్ధం చేసింది. షూటింగ్ మొదలు పెట్టిన దగ్గరినుంచి 'ఆస్కార్' అందుకునేవరకూ జరిగిన ఆసక్తికర ఘట్టాలను ప్రేక్షకులకు పరిచయం చేయనున్నారు.ఒకప్పుడు చాలా తక్కువ సందర్భాల్లో మాత్రమే డాక్యుమెంటరీలు థియేటర్లో విడుదలయ్యేవి. ఓటీటీలు అందుబాటులోకి వచ్చాక, అవి మరింత ప్రాచుర్యం పొందాయి. వినూత్నంగా ఆలోచించే రాజమౌళి, 'ఆర్ఆర్ఆర్' డాక్యుమెంటరీని థియేటర్లో విడుదల చేస్తున్నారు. డిసెంబరు 20వ తేదీ నుంచి ఎంపిక చేసిన మల్టీప్లెక్స్ స్క్రీన్లలో దీనిని ప్రదర్శించనున్నారు. బుక్ మై షోలో ఇందుకు సంబంధించిన టికెట్లను అందుబాటులో ఉంచారు. మల్టీప్లెక్స్ లలో సాధారణ టికెట్ ధరను రూ.200 నుంచి రూ.300 వరకూ ఉంది. 1 గంట 38 నిమిషాల నిడివి గల ఈ డాక్యుమెంటరీతో చిత్ర బృందం 'ఆర్ఆర్ఆర్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకోనుంది. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్కు విశేష స్పందన లభిస్తోంది.

# అది 'ది రాజాసాబ్' లీక్డ్ ఫొటో కాదు :నిధి అగర్వాల్

**సోషల్ మీడియాలో వైరల్గా మారిన తన ఫొటోను ఉద్దేశించి స్పష్టత ఇచ్చారు నటి నిధి అగర్వాల్ అది 'ది రాజా సాబ్ చిత్రానికి సంబంధించిన ఫొటో కాదు అన్నారు.**




సోషల్ మీడియాలో వైరల్గా మారిన తన ఫొటోని ఉద్దేశించి స్పష్టత ఇచ్చారు నటి నిధి అగర్వాల్ అది 'ది రాజా సాబ్ చిత్రానికి సంబంధించిన లీక్డ్ ఫొటో అంటూ జరుగుతోన్న ప్రచారంపై ఆమె క్లారిటీ ఇచ్చారు. ఆ ఫొటోకు, ఈ చిత్రానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. "అది 'ది రాజా సాబ్ లీక్డ్ ఫొటో కాదు. ఇటీవల నేను చేసిన ఒక యాడ్ షూట్ ఫొటో ఇది. సినిమాకు సంబంధించిన అప్డేట్లను త్వరలోనే మీకు ఇస్తాం. నన్ను నమ్మండి. మీ ఎదురుచూపులకు తగిన విలువ లభిస్తుంది" అని ఆమె పేర్కొన్నారు.ప్రభాస్ హీరోగా మారుతి తెరకెక్కిస్తోన్న చిత్రం 'ది రాజా సాబ్. హారర్, రొమాంటిక్ కామెడీ నేపథ్యంతో రూపొందుతున్న ఈ సినిమాలో మాళవికా మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లు. ఇందులో ప్రభాస్ ఇప్పటివరకూ పోషించని రెండు భిన్న కోణాలున్న పాత్రలో సందడి చేయనున్నారు. 2025 ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా విజువల్స్ను ఇటీవల నిర్మాత భూషణ్కుమార్ చూశారు. కొన్ని రోజుల క్రితం ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ది రాజాసాబ్లోని కొన్ని సీన్స్.. హాలీవుడ్ మూవీ 'హ్యారీపోటర్ న్ను తలపించేలా ఉన్నాయంటూ సినిమాపై ఆసక్తి పెరిగేలా చేశారు. 'ది రాజా సాబ్ తోపాటు 'హరి హర వీరమల్లు' కోసం నిధి అగర్వాల్ వర్క్ చేస్తున్నారు. ఈ రెండు చిత్రాల్లో భాగం కావడం ఆనందంగా ఉందని ఇటీవల ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## 'లగాన్'ను నిర్మించలేమని చేతులెత్తేస్తే..!

**ఆమిరాఖాన్ కీలక పాత్రలో అశుతోష్ గోవారికర్ రూపొందించిన 'లగాన్'ను మొదట నిర్మించేందుకు ఎవరూ ఆసక్తి చూపలేదు.**




భారతీయుల ఆత్మగౌరవానికి, బ్రిటిష్ దొరల అహంకారానికి మధ్య జరిగిన కథగా ఆద్యంతం హృదయాల్ని తాకేలా తెరకెక్కిన చిత్రం 'లగాన్' . మూడేళ్ల పాటు పన్నుల నుంచి మినహాయింపు పొందడానికి మనదేశంలోని ఓ ప్రాంతానికి చెందిన కొందరు ఓ టీమ్ ఏర్పడి తెల్లవాళ్లతో క్రికెట్ ఆడి గెలిచిన తీరుకి ప్రేక్షకుల నీరాజనం పట్టారు.బాక్సాఫీసు వద్ద వసూళ్ల వర్షం కురిపించిన ఈ సినిమాని నిర్మించడానికి మొదట్లో ఎవరూ ముందుకు రాలేదంటే ఆశ్చర్యం వేయక మానదు. చిత్ర దర్శకుడు అశుతోష్ గోవారికర్ ఈ సినిమా కథని పలువురు నిర్మాతలకు వినిపిస్తే చాలా బాగుంది కానీ నిర్మించలేము అని చేతలెత్తేశారట. కథని గోవారికర్ ఎంత బలంగా నమ్మారో... ఆమిర్ కూడా అంతే విశ్వసించారు. దాంతో ఆయనే తన 'ఆమిరాఖాన్ ప్రొడక్షన్స్'లో తొలి చిత్రంగా దీన్ని నిర్మించారు.ఈ సినిమా కోసం గోవారికర్ పడిన కష్టం అంతా ఇంతా కాదు. ఆయన ఓ రోజు షూటింగులో గాయాల పాలై మంచం మీద నుంచి లేవలేని పరిస్థితి ఏర్పడింది. అయినాసరే సినిమా ఆగకూడదని గోవారికర్ తన మానిటర్ పక్కనే ప్రత్యేకంగా ఓ బెడ్ను ఏర్పాటు చేయించుకొని చిత్రీకరణను కొనసాగించడం ఆయన నిబద్ధతకు నిదర్శనం.

అప్పటి వరకూ ఏ భారతీయ చిత్రానికి పనిచేయనంత ఎక్కువ మంది బ్రిటిష్ నటులు ఈ సినిమా కోసం పనిచేయడం మరో విశేషం.

## చరిత్రలో నేటి ప్రత్యేకత


- **1927:** భారతీయ స్వతంత్ర సమర-యోధుడు అష్ఫాకుల్లా ఖాన్ మరణం (జ.1900). (ఛిత్రంలో)
- **1934:** భారత దేశ 12వ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ జననం.
- **1935:** భారత మాజీ క్రికెట్ క్రీడాకారుడు రాజ్‌సింగ్ దుంగార్పుర్ జననం.
- **1952:** ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయనున్నట్లు ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ లోక్‌సభ లో ప్రకటించాడు.
- **1961:** భారత సైనిక దళాలు పోర్చుగీసు పాలన నుండి గోవా ను విముక్తి చేసాయి.
- **1974:** ఆస్ట్రేలియా క్రికెట్ క్రీడాకారుడు రికీ పాంటింగ్ జననం.
- **1978:** ఇందిరా గాంధీని లోక్‌సభ నుండి బహిష్కరించి, అప్పటి సమావేశాలు ముగిసే వరకు ఆమెకు జైలుశిక్ష విధించారు డిసెంబర్ 26న ఆమెను విడుదల చేసారు



అష్ఫాకుల్లా ఖాన్



పతిభా పాటిల్



జవహర్‌లాల్ నెహ్రూ



గోవా ను



రికీ పాంటింగ్



ఇందిరా గాంధీని

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# గుకేశ్ ఎత్తులతో 'చెస్ నాట్యం' చూశారా..వీడియో వైరల్

**ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ ఫైనల్ పోరులో ప్రత్యర్థిపై గెలిచిన తీరును ఆధారంగా చేసుకొని ఇద్దరు డ్యాన్సర్లు ప్రత్యేక నాట్యం చేశారు. ఇది వైరల్ గా మారింది.**




ఇప్పుడు ఎక్కడ విన్నా చెస్ యువరాజు గుకేశ్ పేరే మార్మోగుతుంది. చెస్ ప్రపంచ ఛాంపియన్ షిప్ లో అనుభవజ్ఞుడైన ప్రత్యర్థి డింగ్ లిరెన్ను ఓడించి 18 ఏళ్ల వయసులోనే విశ్వవిజేతగా నిలిచి సరికొత్త చరిత్రను లిఖించాడు. ఈ అద్భుత విజయం తర్వాత సామాజిక మాధ్యమాల్లో అతడి పై ప్రశంసలు వెల్లువెత్తాయి. ఈక్రమంలోనే తాజాగా ఇద్దరు కళాకారిణులు ఈ జగజ్జేతకు వినూత్నంగా అభినందనలు తెలియజేశారు. తమ సంప్రదాయ నాట్యానికి కాస్త సృజనాత్మకత జోడించి.. గుకేశ్ ఎత్తులతో నృత్యరీతులను కథక్ నృత్యకారిణులు అనుష్క చందక్, మైత్రేయి నిర్గుణ్ చేసిన ఈ నృత్య ప్రదర్శన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారింది. చెస్ ఛాంపియన్ షిప్ ఫైనల్ పోరులో గుకేశ్ నల్లపావులతో, ప్రత్యర్థి లిరెన్ తెల్లపావులతో ఆడిన సంగతి తెలిసిందే. దాన్ని ప్రతిబింబించేలా ఈ ఇద్దరు డ్యాన్సర్లు నలుపు, తెలుపు దుస్తుల్లో నాట్యం చేశారు. ఆఖరి గేమ్లో ప్రత్యర్థి ఎత్తులు, వాటికి గుకేశ్ పైఎత్తులు ఎలా వేశాడో చెప్పేలా తమ నృత్యరీతులతో చూపించారు. ఈ 'చెస్ నాట్యం' వీడియో నెటిజన్లను తెగ ఆకట్టకుంది. 'వీరి సృజనాత్మకత అద్భుతం' అంటూ ఈ కళాకారులపై ప్రశంసలు కురిపిస్తున్నారు.ప్రపంచ చెస్ ఛాంపియన్ షిప్ లో నాలుగు గంటలకు పైగా సాగిన ఆఖరి గేమ్ 58 ఎత్తుల్లో ముగిసింది. తొలుత ఈ గేమ్ డ్రా దిశగానే సాగింది. ఇద్దరి దగ్గర ఒక్కో ఏనుగు, ఒంటె ఉన్నాయి. లిరెన్ కంటే అధికంగా గుకేశ్ దగ్గర ఒక భటుడున్నాడు. అందరూ ఈ గేమ్ కూడా డ్రా అవుతుందని, విజేతను నిర్ణయించేందుకు టైబ్రేక్ తప్పదని అనుకున్నారు. కానీ 55వ ఎత్తులో లిరెన్ చేసిన తప్పిదం గుకేశ్కు కలిసొచ్చింది. లిరెన్ ఏనుగును త్యాగం చేసేందుకు ఎఫ్ నుంచి ఎఫ్2కు కదిపాడు. వెంటనే ఆ ఏనుగును ఏనుగుతో గుకేశ్ చంపేశాడు. గుకేశ్ ఏనుగును లిరెన్ రాజుతో బయటకు పంపించినప్పటికీ.. ఆ వెంటనే రెండు ఒంటెలను ఇద్దరు ఆటగాళ్లు త్యాగం చేసుకున్నారు. ఇక లిరెన్ దగ్గర ఒక రాజు, భటుడు మాత్రమే మిగిలి, ఓటమి ఖాయం కావడంతో అతను నిష్క్రమించాడు.

## ఆరోగ్యం




కొలెస్ట్రాల్ అనేది జిడ్డుగా ఉండే ఓ పదార్థం.. దీని వల్ల ప్రమాదకరమైన గుండెనొప్పి, స్ట్రోక్ దగ్గర్నుంచి చాలా సమస్యలొస్తాయి. మన బాడీలో కొలెస్ట్రాల్ దానంతట అదే పెరుగుతుంది. కొన్నిసార్లు మనం తీసుకునే ఫుడ్ కారణంగా కూడా వస్తుంది. కొలెస్ట్రాల్ రెండు రకాలు ఉంటాయి. అందులో చెడు కొలెస్ట్రాల్, మంచి కొలెస్ట్రాల్. ఇవి రెండు కూడా గుండె ఆరోగ్యంలో కీ రోల్ పోషిస్తాయి. మన బాడీలో కొలెస్ట్రాల్ పెరిగినప్పుడు అవు ఆర్టరీస్‌లో పేరుకుపోతాయి. దీని వల్లే గుండె సమస్యలు వస్తాయి. మరి ఈ సమస్యని తగ్గించుకునేందుకు మన డైట్‌లో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.



# ఈ 6 ఆకుల్ని తీసుకుంటే మీ ఒంట్లోని కొలెస్ట్రాల్ కరుగుతుంది .. గుండెకి ఎలాంటి ఢోకా ఉండదు

### కొలెస్ట్రాల్ తగ్గేందుకు ఆకుకూరలు..




శాచ్యురేటెడ్, ట్రాన్స్‌ఫ్యాట్స్ ఉన్న ఫుడ్స్ తీసుకోవడం వల్ల మన బాడీలో చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుంది. దీంతో పాటు ఎలాంటి వర్క్ చేయకుండా ఉండడం వల్లా కూడా చెడు కొలెస్ట్రాల్ పెరిగి మంచి కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తుంది. దీని వల్లే సమస్యలొస్తాయి. కాబట్టి, సమస్యని ముందుగానే గుర్తించాలి. కొలెస్ట్రాల్‌ని ముందుగానే కంట్రోల్ చేసేందుకు కొన్ని మెడిసిన్స్‌లా పనిచేసే ఆకుకూరలు తీసుకోవాలి. వీటి వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. ఆ ఆకుకూరలు..

### కరివేపాకు..



కరివేపాకుల్లో ఎన్నో గుణాలు ఉన్నాయి. వీటిని మనం కూరల్లో వాడడం వల్ల ఇందులోని గుణాలు మన ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కరివేపాకలు యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి మన బాడీలోని కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తాయి. దీనిని వంటల్లో వాడడం వల్ల రుచి పెరగడమే కాదు.. ఆరోగ్యానికి కూడా మంచిది. దీనిని మనం పొడిలా చేసి కూరల్లో వేయొచ్చు. పచ్చడి చేసుకుని తినొచ్చు. ఎలా అయినా తీసుకోవచ్చు.



### వేపాకులు..



వేపాకుల్లోని గుణాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనే లేదు. ఇవి నేచురల్ డీటాక్సీఫైయింగ్ గుణాలు కలిగి ఉన్నాయని చెప్పొచ్చు. దీనిని తీసుకోవడం వల్ల బ్లడ్‌ని ప్యూరిఫై చేయడమే కాకుండా, లివర్ పనితీరుని మెరుగ్గా చేస్తుంది. ఇవి రెండు కూడా కొలెస్ట్రాల్ లెవల్స్‌ని తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. ఇందులోని గుణాలు చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ని పెంచుతాయి. రెగ్యులర్‌గా వేపాకుల్ని జ్యూస్, సప్లిమెంట్స్ రూపంలో తీసుకుంటే హై కొలెస్ట్రాల్‌ని తగ్గించుకోవచ్చు

### మెంతి ఆకులు..



మెంతి ఆకుల్లో కొలెస్ట్రాల్‌ని తిప్పికొట్టే గుణాలు ఉన్నాయి. ఇందులో సొల్యూబుల్ ఫైబర్ ఉంటుంది. ఇవి కొలెస్ట్రాల్‌ని కరిగిస్తుంది. ఇందులోని గుణాలు బాడీలోని మొత్తం కొలెస్ట్రాల్‌ని కరిగిస్తుంది. ఈ ఆకుల్ని మీరు కూరల్లో వాడొచ్చు. లేదా ఎలా అయినా తీసుకోవచ్చు.



### పుదీనా..



పుదీనా మంచి రీఫ్రెషింగ్ టేస్ట్‌తో ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల ఎన్నో హెల్త్ బెనిఫిట్స్ అందుతాయి. ముఖ్యంగా జీర్ణ సమస్యలు దూరమవుతాయి. దీంతో పాటు కొలెస్ట్రాల్‌ని కరిగిసా-_యి. ఇందులోని మెంథాల్ జీవక్రియకి మేలు చేస్తుంది. దీనిని మీరు ఎలా అయినా మీ డైట్‌లో యాడ్ చేసుకోవచ్చు. మింట్ టీ, రైస్ చేసుకోవడం, పుదీనా పచ్చడి, రసం, స్మూతీస్, సలాడ్స్ ఇలా ఎందులో అయినా పుదీనాని యాడ్ చేసుకుని తినొచ్చు.

### తులసి..



తులసి చెట్టు ప్రతి ఇంట్లోనూ ఉండనే ఉంటుంది. ఇందులో ఎన్నో గుణాలు ఉన్నాయి. పరిశోధన ప్రకారం.. చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించడంలో తులసి ముందుంటుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని తగ్గిస్తాయి. దీని వల్ల కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది. దీనిని మీరు హ్యాపీగా మీ డైట్‌లో యాడ్ చేసుకోవచ్చు. సలాడ్స్, టీలో వేసుకుని తులసి ఆకుల్ని ఆస్వాదించొచ్చు.ఈ ఆకుల్ని తీసుకుంటూనే మీరు హెల్దీ లైఫ్‌స్టైల్ ఫాలో అవ్వాలి. ఎక్సర్‌సైజ్ చేయాలి. మంచి డైట్ తీసుకోవాలి. దీని వల్ల కొలెస్ట్రాల్ తగ్గి గుండె ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది.

**గమనిక:**

ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.